

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డి. జానకి

## అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగొద్దు
- క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉండాలి అసాంఘిక శక్తులపై ఫోకస్
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భద్రతా చర్యలపై సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్ర మునిసిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ ముందస్తు చర్యలపై దృష్టి సారించింది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఎస్పీ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ డి. జానకి సంబంధిత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సాధారణ, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేకంగా సూచనలు ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది కేటాయింపు, గస్తీ, చెక్‌పోస్టులు, సీసీటీవీ పర్యవేక్షణ తదితర అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో అదనపు బలగాలు, క్విక్ రెస్పాన్స్ టీములు సిద్ధంగా ఉంచాలని, అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలని సూచించారు. మద్యం, నగదు, ప్రలోభాల పంపిణీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా పనిచేయాలని, ప్రజలలో భద్రతాభావన కలిగేలా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెల్ డీఎస్పీ గిరిబాబు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్, రూరల్ సీఐ గాంధీ నాయక్, భూత్పూర్ సీఐ రామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ బాలరాజు, సంబంధిత ఎస్సైలు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



ఆర్డీఓ కార్యక్రమంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల ఫిబ్రవరి2, ప్రభాతవార్త:** భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌డీవో కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ భారతికి సంబంధించిన ఫైళ్ళు, రిజిస్టర్లు, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ సమస్యలను నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించా లని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి సేవలు ప్రజలకు మరింత సులభంగా, ఉపయోగకరంగా ఉండేలాచూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, ఏవో వెంకట్ రావు, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### పగలంత ప్రచారాలు..

## రాత్రికి మంతనాలు

- సామాజిక వర్గాల వారీగా సమావేశాలు
- గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రయత్నాలు
- 26 ఏళ్ల తర్వాత మరోసారి మహిళా చైర్ పర్సన్
- అధికార పార్టీ అభ్యర్థుల్లో బీఫాంల టెన్షన్



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** పురపాలక పోరు జోరందుకున్న వేళ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. వనపర్తి పురపాలక సంఘం పరిధిలోని 33 వార్డుల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల సందడి కొనసాగుతోంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, మద్దతు ఇస్తున్న నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. పగలంతా ప్రచారం చేస్తూనే, రాత్రి వేళ మంతనాలతో పావులు కదుపుతున్నారు. విజయమే లక్ష్యంగా ముందస్తు ప్రణాళికలను రచిస్తూ ముందుకు వెళ్తున్నారు. తమ అనుచరుల్లో ముఖ్యులను రంగంలోకి దించి, ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా మద్దతు కూడగట్టడంలో తలమునకలు అవుతున్నారు. అందుకు కుల పెద్దలను సంప్రదిస్తున్నారు. పోలింగ్ బూత్ ల వారీగా ఉన్న ఓట్లను సామాజికవర్గాల వారీగా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపు ఓటములపై ప్రభావం చూపించే పోలింగ్ బూత్ ల పై ప్రత్యేకదృష్టి సారిస్తున్నారని చెప్పవచ్చు. అందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. కుల సంఘాల్లో ఉన్నత పదవుల్లో ఉన్న వారిని మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో మంతనాలు సాగిస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఫోన్లు చేసి, ఆప్యాయంగా పలుకరిస్తూ మద్దతు కోరుతున్నారు. స్థానిక సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తున్నారు. తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తామని, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని భరోసా కల్పిస్తున్నారు. అయితే ప్రస్తుతం పోటీలో ఉండే అభ్యర్థులు అనుచరుల విషయంలో కొంత సందిగ్ధానికి గురవుతున్నారు. ఉదయం ఓ అభ్యర్థికి మద్దతు ఇస్తూనే, రాత్రి వేళ మరో అభ్యర్థితో కలిసి కాలనీల్లో పర్యటిస్తున్నారు. మీకే ఓట్లు వేయిస్తామంటూ చెప్తూ వారితో మమేకం అవుతున్నారు. ఒక్కక్కరిగా కాకుండా కొంత మందిని వెంటేసుకు వెళ్తున్నారు. వారిని బుజ్జగించి, తమ వెంటే ఉండేలా చూసుకునేందుకు అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. తీరా ఎన్నికల వేళకు ఎవరు ఎవరికి మద్దతుగా నిలుస్తారో, విజయానికి సహకరిస్తారో తెలియక సతమతం అవుతున్నారు. మొత్తానికి వనపర్తి పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో రాజకీయ వేడి రాజుకున్నది.

**26 ఏళ్ల తర్వాత మరోసారి మహిళా చైర్ పర్సన్ రిజర్వేషన్....**

వనపర్తి 1984లో పురపాలికగా ఏర్పడినప్పటికి మూడేళ్ల ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగింది. ఇప్పటివరకు ఐదుగురు చైర్మన్లుగా, ఒక మహిళ చైర్ పర్సన్‌గా పాలన కొనసాగించారు. 26 ఏళ్ల తర్వాత మరోసారి మహిళ చైర్ పర్సన్ రిజర్వేషన్ రావడంతో ఆసక్తి రేపుతుంది.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయించాలి

**బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేయాలి**

**మహబూబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, నామినేషన్‌ల ఉపసంహరణపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నామినేషన్ల విత్ డ్రా అనంతరం వివిధ రాజకీయ పార్టీల తరపున, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారికి ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి ఆయా గుర్తులను కేటాయించాల్సి ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలతో కూడిన బ్యాలెట్ పేపర్ ల ముద్రణ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫైనల్ ప్రూఫ్ రీడింగ్ –మిగతా4లో..

## నిబంధనల ప్రకారం మున్సిపల్ ఎన్నికలు

**మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్**



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

**వనపర్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం పరోక్ష విధానంలో నిర్వహించే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో ఎక్స్ అఫిషియోల మున్సిపాలిటీ ఎంపిక కొరకు నోటీసులు జారీ చేసి ఆప్షన్ తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పరోక్ష విధానం ద్వారా చేసే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, రాజ్య సభ సభ్యులు ఎక్స్ అఫిషియో హోదాలో ఏదో ఒక మున్సిపాలిటీని ఎంచుకొని ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సెక్షన్ 5, 20 ప్రకారం ఎవరైనా ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్సీలు తాము ఎన్నికైన 30 రోజుల్లోపు ఏదో ఒక మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించేందుకు ఆప్షన్ ఇచ్చుకొని ఉండాలని, అలా కాకుండా ఇంతవరకు ఆప్షన్ ఇవ్వని పక్షంలో నిబంధన ప్రకారం మున్సిపల్ ఎన్నికలు అయిన 30 రోజుల్లో ఆప్షన్ ను సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనికొరకు ఫిబ్రవరి, 11 నుండి 14వ తేదీ లోపు నోటీస్ జారి చేసి ప్రజాప్రతినిధుల నుండి ఆప్షన్ తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులకు నిబంధనల ప్రకారం ఫిబ్రవరి, 11 నుండి 14వ తేదీలోపు నోటీస్‌లు జారీ చేసి ఆప్షన్ తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డిఆర్డీఒ పిడి ఉమాదేవి, సిపిఒ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

### భక్తులతో కిక్కిరిసిన

## మన్నెంకొండ...




రథోత్సవంలో పాల్గొన్న భక్త జనసందోహం

- వైభవంగా శ్రీ మన్నెంకొండ లక్ష్మి వెంకటేశ్వర స్వామి రథోత్సవం
- ఉమ్మడి జిల్లా నలుమూల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- దాసంగాలు పెట్టి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

**దేవరకద్ర, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల ఇలవేల్పు పేదల తిరుపతిగా పిలవబడే మన్నెంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. జనవరి 28 నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త మధుసూదనాచారి, ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ నిత్యానందం ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ప్రతిరోజు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెల రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం కార్యక్రమం సోమవారం తెల్లవారుజామున వైభవంగా కొనసాగింది. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుండే కాక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక –మిగతా4లో..

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

**రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి**




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్ ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గంలోని ఉమ్మడి ఆత్మకూరు మండలంలో అభివృద్ధిని చూసి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆత్మకూరు మూడు ముక్కలుగా చేయడమే కాకుండా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తద్వారా గత శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జూరాల గ్రామం సమీపంలో కృష్ణ నదిపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే 123 కోట్ల నిధులను కేటాయించి పనులను ప్రారంభించామని అంతేకాకుండా ఆత్మకూరు పట్టణానికి 15 కోట్ల నిధులు వెచ్చించి అంతర్గత రహదారులు మరియు మురుగు కాలువల నిర్మాణాలకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నట్లుగా ఆయన తెలిపారు. గత రెండు సంవత్సరాల కాలంలో ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ఆశీర్వదించాలని ఆయన కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీలో మున్సిపల్ కేంద్రాలలో నామినేషన్లు వేసుకున్న అభ్యర్థులను ఆయన ప్రత్యేకంగా కొరియాడుతూ అవినీతికి దూరంగా ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తద్వారా మరో మూడు సంవత్సరాల కాలంలో ప్రజలు ఊహించని విధంగా అభివృద్ధి చేసి చూపెడతామని ఆయన హామీ ఇచ్చారు. గత రెండు సంవత్సరాల కాలంలో ఉమ్మడి ఆత్మకూరు మండలంలో అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగుతున్న ప్పటికీ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు మాత్రం కళ్ళుండి చూడలేని ధృతరాష్ట్రుడి మాదిరిగా అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆత్మకూర్ ప్రజల చిరకాల కోరిక అయినటువంటి రెవెన్యూ డివిజన్ సాధించడమే తన ఏకైక లక్ష్యం అని ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా తనకు సంపూర్ణ సహకారం అందించి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు తులసిరాజు యాదవ్ పట్టణ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింలు, దామోదర్, శివన్న, శ్రీనివాసులు, గాలి పంపు శ్రీనివాసులు, బుచ్చన్న, వెంకటన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాముడు పేరు చెప్పి పేదలకు అన్యాయం చేస్తే

## గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడుదాం

**ఉపాధి కూలీల ఐక్యతతో చట్టాన్ని అడ్డుకుంటాం : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్**




బుడ్డతండా గ్రామసభలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** రాముడు పేరు చెప్పి చట్టాలు మార్చి పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, చట్టాన్ని రద్దు చేసేంతవరకు గల్లి నుంచి ఢిల్లీ వరకు పోరాటం సాగిస్తామని ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షినటరాజన్ హెచ్చరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షినటరాజన్ హెచ్చరించారు. సోమవారం అచ్చంపేట మండలం బుడ్డ తండా, బల్మూరు మండలం చెంచుశగూడెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. బుడ్డ తండా, చెంచు గూడెం గ్రామ సభలో మోడీ ప్రభుత్వం అమలు చేసిన చట్టాన్ని సత్వరమే రద్దు చేయాలని తీర్మానం చేస్తూ రాష్ట్రపతి , ప్రధానమంత్రి, గవర్నర్ కు ఉపాధి కూలీలు వినతి పత్రం పై సంతకాల సేకరణ చేపట్టారు. రాముడు ప్రజలకు మేలు చేశాడు కానీ, మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, చట్టాన్ని సత్వరమే రద్దు చేయకపోతే గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. 2025 సంవత్సరంలో స్థానికంగా ఉపాధి కల్పించేందుకు అప్పట్లో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యుపిఎ చైర్పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ నేతృత్వంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయడం జరిగిందని,, 2006 సంవత్సరం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు ఎంతో దోహద పడిందని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందేందుకు పేద ప్రజలను ఆదుకునేందుకు తీసుకున్న పథకాన్ని చట్టాలు అమలు చేసి రద్దు చేయాలని ప్రయత్నిస్తే చూసి ఊరుకోబోమని హెచ్చరించారు. గాంధీ పేరు తొలగిస్తే అభ్యంతరం లేదు...దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత స్థానికంగా ఉన్న కూలీలకు ఉపాధి పొందేందుకు కనీస వేతనంతో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ నేతృత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005 లో ప్రతిష్టాత్మకంగా చట్టాన్ని తీసుకురావడం జరిగిందని, దీంతో కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించి, కనీసం నిత్యం 200 రూపాయల కూలీ డబ్బులు అందేలా పథకాన్ని అమలు చేస్తే, అట్టి పథకాన్ని మోడీ ప్రభుత్వం తూట్లు పొడిచేలా మోడీ ప్రభుత్వం పేరు మార్చి పేదల హక్కులను కాల రాస్తున్నారని, చట్టాన్ని రద్దు చేసి గతంలో ఉన్న విధంగా ఉపాధి హామీ పథకం పేదలకు అందేలా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుడ్డ తండాలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పనిచేస్తున్న కూలీల వద్దకు నేరుగా వచ్చి కూలీలకు అందుతున్న వేతనం, మోడీ –మిగతా4లో..



ఎంపీ డీకే అరుణతో కలిసి ఎంవిఎస్ కళాశాలలో సభ ఏర్పాట్ల పరిశీలిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు

## రేపు పాలమూరుకు బిజెపి జాతీయ అధ్యక్షుడు

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరుకానున్న నితిన్ నబిన్ సిన్హా
- భారీ ఎత్తున ఘన స్వాగతం పలకాలి
- సభను విజయవంతం చేయాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు
- ఎంపీ డీకే అరుణతో కలిసి ఎంవిఎస్ కళాశాలలో సభ ఏర్పాట్ల పరిశీలన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** బిజెపి నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత మొట్టమొదటిసారి తెలంగాణకు అందులోనూ పాలమూరుకు వస్తున్న నితిన్ నవీన్ సిన్హా కు ఘన స్వాగతం పలుకుదాం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ ఎంపీడీకే అరుణతో కలిసి జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 25 వేల మందికి పైగా కార్యకర్తలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడి రాకతో రాష్ట్రంలోనే కాదు ఇటు ఉమ్మడి పాలమూరులోనూ –మిగతా4లో..

## గద్వాల మున్సిపాలిటీపై బిజెపి జండా ఎగురవేద్దాం


బి ఫామ్ లు సమర్పించేందుకు ర్యాలీగా వెళుతున్న బీజేపీ నాయకులు

**గద్వాల ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ పార్లమెంట్ సభ్యురాలు డికే అరుణమ్మ సీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికలలో గద్వాల మున్సిపాలిటీ పై బిజెపి జెండా ఎగురవేద్దాం అని జిల్లా యువ నాయకురాలు డీకే. స్నిగ్ధారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గద్వాల పట్టణంలోని మున్సిపాలిటీ కౌన్సిలర్ స్థానానికి పోటీ చేస్తున్న బిజెపి పార్టీ అభ్యర్థులు 34మందికి బిఫారములు అందజేయడానికి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి మున్సిపల్ ఎన్నికల అధికారులకు భీ ఫామ్‌లను అందజేశారు. ఈసందర్భంగా స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ...గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బిజెపి పార్టీని గెలిపించాలనీ అన్నారు. 37 వార్డులలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేయడం జరిగిందని, ప్రతి వార్డులో బిజెపి అభ్యర్థి కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె గద్వాల పట్టణ ఓటర్లను అభ్యర్థించారు. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు బండల వెంకట్రాములు, వెంకటేశ్వర రెడ్డి, మహిళా నాయకురాళ్లు పద్మావతి, కృష్ణవేణి, రజక జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలను సాధించాలి


తరగతి గదిలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ట్రైనర్ మహేష్

**గద్వాల ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** 10వ తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలరని డీఆర్డీఏ -ఎజిఎమ్ఎమ్ ట్రైనర్ మహేశ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం గద్వాల మండలం పూడూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల కోసం విద్యార్థుల విజయానికి దిక్సూచి: సమయ పాలన – ప్రేరణ" అనే అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ చదువుకు షెడ్యూల్ రూపొందించుకొని, దానికి కట్టుబడి ముందుకు సాగితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని సూచించారు. అలాగే ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఏకాగ్రత ఉంటే విద్యార్థులు ఏ స్థాయికైనా చేరుకోగలరని ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో సమయ పాలన ఎంతో ముఖ్యమని, లక్ష్యాన్ని గోడపై రాసి ప్రతిరోజూ చూసుకుంటే అది విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. వైఫల్యం అనేది గమ్యం కాదని, విజయానికి దారి చూపే ఒక దశ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జిహెచ్ఎం రామన్న, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ


శివపార్వతులను ఊరేగిస్తున్న శివస్వాములు

**నవాబుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జెకె ట్రస్ట్, సర్పంచ్ గీతారాణి సుధాకర్ జేకే ట్రస్ట్ డైరెక్టర్ నరసింహచారి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ శివాలయం ఆవరణలో సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజను శాస్త్రోక్తంగా ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివపార్వతులను మండల కేంద్రంలో ఊరేగింపుగా రథోత్సవం, అట్టహాసంగా శివ స్వాములు గ్రామస్తులు భజన ఆటపాటలతో భక్తుల పారవస్యంతో ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో గురుస్వామి మఠం ఈశ్వరయ్య, జేకే ట్రస్ట్ సభ్యులు ట్రస్ట్ కార్యకర్తలు, మండల ప్రజా ప్రతినిధులు, శివ స్వాముల కుటుంబ సభ్యులు గ్రామస్తులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడలు శరీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


సీఎం కప్పు క్రీడా పోటీలలో పాల్గొన్న తాసిల్దార్ జ్యోతి

**అయిజ ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** క్రీడలు శరీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మండల తహసీల్దారు జ్యోతి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉత్తనూరు గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం నందు నిర్వహించబడిన సీఎం కప్ 2025. 2026 క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థిని విద్యార్థులకు క్రీడాలను ప్రోత్సహించేందుకు సీఎం కప్పు క్రీడలు ప్రవేశపెట్టిదన్నారు. అలాగే విద్యార్థులు ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆటలతోపాటు చదువులో ముందు ఉంటారన్నారు. పోటీలను గెలుపు ఓటములను సమానంగా తీసుకొని గెలిచిన ఓడిన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉన్నత స్థానాలను అందుకోవాలని విద్యార్థిని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, గ్రామ సర్పంచ్ రాణేమ్మ, సీఎం కప్ మండల కన్వీనర్ వైజాగ్, మండల విద్యాధికారి రాములు దయాల్ , డివైస్ కృష్ణ , ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ శ్రీనాగేష్ గారు, జిల్లా స్టేడియం ఇన్చార్జ్ శ్రీ బషీర్ అహ్మద్ , సీఎంకప్ మండల కన్వీనర్ సతీష్ కుమార్, వివిధ పాఠశాలల పీడీలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## సిఎం కప్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**మండలస్థాయి అధికారులతో ఎంపీడీఓ వరుణ్ తేజ**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** రేపు బుధవారం మండల స్థాయిలో సీఎం కప్ 2025 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సహకరించాలని ఎంపిడిఓ వరుణ్ తేజ కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అందరు సహకరించాలని కోరారు. రేపు ఉదయం 9 గంటలకు పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతల ఆవరణలో జరిగే కార్యక్రమంలో ఎంపిక నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటికే క్లస్టర్ పరిధిలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపిడిఓ వరుణ్ తేజ, తహసీల్దార్ అద్దంకి సునీత, మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, పిఇటి లు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి


ఎంపీడీవో కథలప్పకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

**బిజినేపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికుల పాలిట శాపంగా మారిన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కథలప్పకు సమ్మె నోటీసుతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. జీవో నెంబర్ 51 సవరణ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గత రెండు మూడు నెలలుగా ఆగిపోయిన వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.21,000 కు పెంచాలని, సామాజిక భద్రత: ప్రతి కార్మికునికి ఈఎస్ఐ పీఎఫ్ ,సౌకర్యాలు కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రమాద పరిహారం రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఈ నెల 12వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు జశ్వంత్ కుమార్, నాయకులు వెలుగొండ రాములు, శంకర్, రామకృష్ణ, మైబూస్, సామ శ్రీశైలం, సురేష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

# తరగతి గదిని పంచుకున్నారు

**ఒకే గదిలో పంచాయతీ కార్యాలయం అంగన్‌వాడి నిర్వహణ**



ఒకే తరగతి గదిలో గ్రామపంచాయతీ అంగన్‌వాడి నిర్వహణ

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో ఐదు తరగతులకు గాను ఐదు తరగతి గదులు ఉండాలి కానీ మండలంలోని చిన్న వడ్డేమాన్ గ్రామంలో ఐదు తరగతులకు గాను మూడు గదులు ఉన్నాయి. ఈ మూడు తరగతి గదుల్లో ఒక తరగతి గదిలో గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడి నిర్వహిస్తుండడం గమనార్హం. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చిన్న వడ్డేమాన్ గ్రామం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. అప్పుడు ఒక షెటర్‌లో గ్రామపంచాయతీ కార్యకలాపాలను నిర్వహించే వారు అంగన్‌వాడి నిర్వహణ కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాలన్న అప్పటి ప్రభుత్వ ఆదేశం మేరకు ఒక తరగతి గదిలో అంగన్‌వాడి నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఏడాదిగా గ్రామపంచాయతీని కూడా అంగన్‌వాడీ నిర్వహిస్తున్న గదిలోని ఒకపక్క నిర్వహిస్తున్నారు. గ్రామసభలాంటి కార్యక్రమాల నిర్వహణకు గాను శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పక్క ఖాళీ స్థలంలో నిర్వహిస్తుంటారు. ఈ ఒక్క తరగతి గదిలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడి నిర్వహణ కారణంగా అంగన్‌వాడీ కి వచ్చే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఐదు తరగతులకు గాను పాఠశాల గదులు సరిపడా లేకపోవడంతో మూడు, నాలుగు తరగతి విద్యార్థులను వరండాలోనే కూర్చోబెట్టి విద్యాబోధనను కొనసాగిస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి గాను స్థానిక ఎమ్మెల్యే సహకారంతో త్వరలోనే గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మిస్తామని గ్రామ సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ తెలిపారు.

## అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టండి

**రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, వాకిటి శ్రీహరి**


అభ్యర్థులకు బీఫామ్ అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**అమరచింత ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజల మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం అమరచింత మునిసిపల్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, శివసేనారెడ్డి, రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బి ఫాం అందజేశారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధి లక్ష్యముగా అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 15 కోట్ల నిధుల తో పట్టణంలో డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులను చేపట్టామని ఆయన అన్నారు. అలాగే అమరచింత పెద్ద చెరువు పర్యటక కేంద్రముగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మూడు కోట్ల నిధులు మంజూరు అయ్యాయని త్వరలో పనులు పడుతున్నామని ఆయన అన్నారు. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ పార్టీ పై బురద జల్లుతున్నాయని ప్రభుత్వంపై విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షమైన సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్లు కమలాకర్ గౌడ్, రవికాంత్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.

## విద్యారంగం పట్ల కేంద్ర ప్రభుత్వ నిరక్ష్య వైఖరి



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్

**ఆత్మకూర్ ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్లో భాగంగా విద్యారంగానికి అతి తక్కువ బడ్జెట్ కేటాయించి కేంద్ర ప్రభుత్వం విద్య పట్ల తన నిరక్ష్య వైఖరి స్పష్టంగా బయట పెట్టుకుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలని మేధావులు మరియు విద్యావేత్తలు సూచించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం 55లక్షల కోట్లకు పైబడి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ విద్యారంగానికి మాత్రం కేవలం 1,39 వేల కోట్లు కేటాయించి కేవలం రెండు శాతం విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కార్పొరేట్ రంగాలకు పెద్దపీట వేస్తూ బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడం లక్ష్యమే స్పష్టంగా కనిపిస్తుందని ఆయన ఆరోపించారు . ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మరియు జూనియర్ కళాశాలలో లక్షలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా నిరక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా ప్రైవేట్ విద్యారంగాన్ని పెంచి పోషించడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తుందని అంతేకాకుండా దేశంలో కాషాయీకరణ విద్యావిధానాన్ని తెచ్చి మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వివరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జిడిపిలో 6 కేటాయించి వార్షిక బడ్జెట్లో విద్యావేత్తల సూచన మేరకు పది శాతం నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో పిడిఎస్సి నాయకులు చరణ్, విమల్, వెంకట్ తదితలతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనలో వెనకడుగు వేయొద్దు : గ్రూప్-2 విజేత శ్రీకాంత్



విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇస్తున్న గ్రూప్-2 విజేత శ్రీకాంత్

**ధన్వాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని కొండాపూర్ పీఎం శ్రీ గురుకుల జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రూప్-2 విజేత, ట్రైనీ డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టు వదలకుండా లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరంగా ప్రయత్నించాలి" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. తాను కూడా సాధారణ విద్యార్థిగా చదువుకుని, అనేక అడ్డంకులను అధిగమిస్తూ ఈ స్థాయికి చేరుకున్నానని శ్రీకాంత్ తెలిపారు. క్రమశిక్షణ, కష్టపాటు, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని స్పష్టంగా చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో చదవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ రాజారాం మాట్లాడుతూ శ్రీకాంత్ ఈ కళాశాల పాత విద్యార్థి కావడం తమకు గర్వకారణమని తెలిపారు. ఆయన విజయం ప్రస్తుత విద్యార్థులకు గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకాంత్ ప్రసంగం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టత తీసుకువచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## కంది పంట అగ్నికి ఆహుతి - రైతుకు భారీ నష్టం



అగ్నికి ఆహుతైన కందిపంట

**నారాయణ పేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన ఓ రైతు కంది పంట అగ్నికి ఆహుతై తీవ్ర నష్టాన్ని చవిచూశాడు. గ్రామానికి చెందిన లింగయ్య గౌడ్ తండ్రి నారాయణ గౌడ్అనే రైతు వేసిన కంది పంట దురదృష్టవశాత్తు అగ్నికి ఆహుతైంది. మూడు రోజుల క్రితం రైతు పొలంలో లేని సమయంలో, పక్కనున్న భూమి యజమాని తన పొలంలోని గడ్డి దహనం చేయగా ఆ మంటలు గాలికి వేగంతో పక్కనే ఉన్న లింగయ్య గౌడ్ పొలానికి వ్యాపించాయి. అప్పటికే కోసిన కంది మెదలు పొలంలోనే ఉండగా అవి పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. సుమారు రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన కంది పంట పూర్తిగా దగ్ధమై రైతుకు అపార నష్టం జరిగింది. విషయం తెలిసిన గ్రామ ప్రజలు పంచాయతీ పెట్టి బాధ్యులపై విచారణ జరిపినప్పటికీ, స్పష్టమైన సమాధానం రాకపోవడంతో రైతుకు న్యాయం జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగయ్య గౌడ్ స్వయంగా రైతు కావడంతో పాటు కుటుంబ పోషణ కోసం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితిలో పంట నష్టం అతని కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు, అలాగే భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు ప్రభుత్వ అధికారులను కోరుతూ, మండల తహసీల్దార్, వ్యవసాయ అధికారుల ద్వారా విచారణ జరిపి రైతుకు తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, ఆర్థిక సాయం అందించి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

## వార్త క్యాలెండర్ ఆవిష్కరణ


వార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా అప్పక్ పల్లి దగ్గర ఉన్న ప్రభుత్వ వైద్యశాల, కాలేజీ దగ్గర వార్త జిల్లా క్యాలెండర్‌ను మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. సంపత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.కిరణ్ ప్రకాష్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్త పత్రికలో ప్రచురితమయ్యే వార్తలకు ప్రజల్లో విశేష స్పందన ఉంటుందని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్న పత్రికగా వార్త విశేష పాత్ర పోషిస్తోందని అభినందించారు.

## పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు

**మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రకటన**




**మద్దూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓటరుగా నమోదు అయి, మున్సిపల్ ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు ఫారం-12 దరఖాస్తు, ఎన్నికల విధుల నియామక ఉత్తర్వుల కాపీ, ఎపిక్ ఓటరు కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు కాపీలను 03.02.2026 లోపల మద్దూర్ మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. గడువు లోపల దరఖాస్తు చేయని వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండదని స్పష్టం చేశారు.

## అయ్యవారిపల్లిలో గ్రామ మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ


గ్రామ సమాఖ్య భవనానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి2 ప్రభాతవార్త:** మండలంలోని అయ్యావారిపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ చేశారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అయ్యావారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఇ మహేష్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## భాజపాలో వర్గ రాజకీయాలు

**కార్యకర్తలకు అన్యాయం.. మండల నాయకుల రాజీనామా**


మాట్లాడుతున్న సీనియర్ నాయకులు

**మద్దూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** భాజపాలో వర్గ రాజకీయాలు పెరిగి, పార్టీ సిద్ధాంతాలకు నిబద్ధంగా పనిచేసే కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మద్దూరు మండలానికి చెందిన సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు మండల స్థాయి నాయకులను పూర్తిగా పక్కన పెట్టి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనని కొందరికి ప్రాధాన్యత ఇస్తున్నారని వారు విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల బీ-ఫామ్ కేటాయింపులో కార్యకర్తల అభిప్రాయాలను పూర్తిగా విస్మరించడం పార్టీకి తీవ్ర నష్టం కలిగించే చర్యగా పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు నిరసనగా సీనియర్ నాయకుడు కుర్వ రాము, కార్యకర్తలు మసగాళ్ల అంజి, బొట్టు శీను, దూలం నవీన్, పల్లెర్ల హుస్సేన్, అశోక్, వెంకటేష్, ప్రసాద్ తదితరులు భాజపాకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

## పదో తరగతి విద్యార్థులకు అభ్యాస దీపికలు



పదవ తరగతి విద్యార్థులకు అభ్యాస దీపికల వితరణ

**కెటిదొడ్డి ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాత పాళెం గ్రామం "జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో" రాబోయే పదవతరగతి విద్యార్థులు "100 "శాతం ఉత్తీర్ణత సాధించడానికి వెనుకబడిన విద్యార్థులందరు స్వీయ అభ్యసనం ద్వారా ముఖ్యాంశాలను సులభంగా అర్థం చేసుకొని ప్రాక్టీసు చేసుకోవడానికి అనుగుణంగా ఉండే విధంగా "రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి విషయ నిపుణుల "బృందంతో తయారు చేయబడిన అభ్యాస దీపికలను పదవ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యాస దీపిక అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర, వెంకటేశ్వర్ గౌడ్, కర్రెప్ప, వెంకట్‌రెడ్డి, గజేంద్ర, ప్రహ్లద్, గోపాల్, సురేందర్, తన్వీర్, ఖాజా, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు

**వనపర్తి, ఫిబ్రవరి2 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం నర్సింగాపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం ఏర్పాటుచేయనున్న ప్రతిటేబుల్ వద్దతప్పనిసరిగా సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఒక అభ్యర్థికి ఒక ఏజెంట్ చొప్పున ఐడి కార్డులు జారీ చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద లెక్కింపు కేంద్రం పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఇతర ఉన్నతాధికారులు, రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో వనపర్తి పట్టణం ఎంతో అభివృద్ధి

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మెగారెడ్డి అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సోమవారం వనపర్తి పట్టణంలోని 13, 14, 17 వార్డులలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగావార్డుల్లోకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, తిలకం దిద్దు తూ, మంగళ హారతులు ఇస్తూ,డప్పు వాయిద్యాల మధ్యన, పూలవర్షం కురిపిస్తూఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి వచ్చాక వనపర్తి పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన లాంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి నిరుపేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు.

## నర్సరీలోని మొక్కలను సంరక్షించాలి : ఎంపీడీవో

**నవాబుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** మొక్కలను ఎండిపోకుండా సంరక్షించుకోవాలని మండల అధికారులు ఎంపీటీవో జయరాం, ఏపీవో జ్యోతి అన్నారు. మండల పరిధిలోని రామ్ సింగ్ తాండ గ్రామాన్ని సోమవారం ఎంపీడీవో జయరాములు, ఏపీవో జ్యోతి సందర్శించి నర్సరీలలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. సహాయకులకు పలు సూచనలు చేశారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు మూడు పూటలా నీరు పట్టాలని వర్షాకాలం నాటికి సిద్ధం చేయాలని తెలిపారు. మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్సరీ కూలీలతో పాటు పంచాయతీ సెక్రెటరీ గ్రామస్తులు ఉన్నారు.

## బంజారా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**బాలానగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** బాలానగర్ మండలం పెద్దాయపల్లి చౌరస్తా సమీపంలో సోమవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి బంజారా ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటలలో గెలుపు, ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, శరీర దృఢత్వానికి తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేంచమ్మక్ చంద్ర, కొమరయ్య, బంజారా నటుడు నరేష్, రాము రాథోడ్, నిర్వాహకులు రాము నాయక్, అరుణ్ నాయక్, రవి నాయక్, పెద్ద ఎత్తున మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్



**వెల్దండ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బండోనిపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళా శక్తి భవనానికి గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కేశమల్ల అనసూయతో కలిసి గ్రామ సర్పంచ్ ఏనుముల సంగీత శేఖర్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగీత శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్నిఅన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి నందకిశోర్, గ్రామస్తులు సురేందర్‌రెడ్డి, వసంత, పర్వతాలు, కృష్ణయ్య, ఉపేందర్, నిరంజన్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఆలయానికి స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజిత్ నాయక్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 52 తండాలలో గిరిజనులము ఉన్నామని మా కోరిక మేరకు మా ఆరాధ్య దైవమైన సంతు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని ఘనంగా పూజలు పండుగలు నిర్వహిస్తామని తహసిల్దార్ కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు బాణావత్ శంకర్ నాయక్, నాగులు నాయక్, గోపాల్ నాయక్, నారాయణ నాయక్, సర్పంచులు రమేష్ నాయక్, కేశ నాయక్, రవీందర్ నాయక్, పంతుల్లా నాయక్, లాలు నాయక్, జయరాం నాయక్, రాహుల్ నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# చెంచులకు ఉపాధి కల్పించాలి

◆ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి2 ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో చెంచులకు 300 రోజులు పని దినాలు కల్పించాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. చెంచు గూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం యధావిధిగా కొనసాగిస్తూ గతం మాదిరిగానే చెంచులకు 300 పనిదినాలు కల్పించాలని, 15 రోజులు ముందుగానే డబ్బు చెల్లించాలని, గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పని దినాలు పెంచాలని, కూలీలతో ఎక్కువ చేయాలని, మన గ్రామంలో కూలీలు ఎంపిక చేసుకొని పనిచేసే విధంగా హక్కు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. పేదలను కాల రాస్తే ఉద్యమించడం ఖాయమని హెచ్చరించారు. 2006 ఫిబ్రవరి 2 నుంచి అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 20 సంవత్సరాల పాటు పేదలకు అండగా నిలిచిందని, శ్రీరాముని పేరిట పేదలకు అన్యాయం చేయడానికి పీఎం నరేంద్ర మోడీ, అమిత్‌షా కుట్రలు పన్నారని సత్వరమే చట్టాన్ని రద్దు చేస్తూ ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని ఆమె కోరారు. చట్టాన్ని రద్దు చేయకపోతే అచ్చంపేట నియోజకవర్గం నుంచి ఉద్యమం కొనసాగుతుందని ఆమె హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, ఆదివాసి రాష్ట్ర అధ్యక్షుడు, నల్గొండ ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, నరసయ్య యాదవ్, మాజీ ఎంపీపీరామనాథం, కాశన్న యాదవ్, శత్రు నాయక్ ,కపిలవాయి చంద్రమోహన్, నరసింహారావు, శ్రీపతిరావు, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కష్టపడిన కార్యకర్తలకే తగిన ప్రాధాన్యత



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి,తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో మండల నాయకులు

**వెల్దండ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకురావడానికి సైనికుల వలె పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, పార్టీ, ప్రభుత్వ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించి గుర్తింపునిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌కు ఘనస్వాగతం పలికి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షినటరాజన్ మాట్లాడుతూ బీజేపీకేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను అభివృద్ధికి దూరం చేసే దిశగా మహాత్మాగాంధీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యంచేసే విధంగా నరేంద్రమోడీ కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలఅమలు తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సమన్వయ కర్త గంప వేణుగోపాల్, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి అనులేఖ బోస, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతీలాల్ నాయక్, మాజీ సర్పంచ్ యన్నం భూపతిరెడ్డి, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, తక్కళ్ళపల్లి శేఖర్, ఎర్రశ్రీను, కృష్ణముదిరాజ్, రాజశేఖర్, ముదిగొండ రమేష్, పుల్లయ్య, పురుషోత్తమచారి, హమీద్, వెంకటరెడ్డి, రషిద్, భరత్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ టాలెంట్ టెస్ట్ విజయవంతం

టాలెంట్ టెస్టులతో విద్యార్థులలో పోటీతత్వం పెంపొందుతాయి : జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్



విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న డీఈవో

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులఫోరం మహబూబ్నగర్ వారి ఆధ్వర్యంలో జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ కేజీబీవీల లో పదవ తరగతి చదివే విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన టాలెంట్ టెస్టు విజయవంతమైంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పాఠశాలల నుంచి తెలుగు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు దాదాపుగా 200 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి టాలెంట్ టెస్టులు నిర్వహించడం వలన విద్యార్థులలో పోటీతత్వం, పిల్లలలో పెంపొందుతాయని రాబోయే పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో వివిధ ఉద్యోగాలలో పోటీ పడడానికి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్టులు ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు మీడియంలో మొదటి బహుమతి శ్రీకాంత్ జెడ్పిహెచ్ఎస్ తాటికొండ 82 మార్కులు, రెండవ బహుమతి లక్ష్మణ్ జెడ్పిహెచ్ఎస్ వేపూరు 80 మార్కులు, మూడవ బహుమతి రాజు జెడ్పిహెచ్ఎస్ వేపూరు 77 మార్కులు సాధించారు. ఇంగ్లీష్ మీడియంలో మొదటి బహుమతి బి. అరవింద్ జడ్పిహెచ్ఎస్ (బాలురు) గండీడ్ 77 మార్కులు, బి.సాయికృష్ణ మోడల్ బేసిక్ హై స్కూల్ 77 మార్కులు రెండవ బహుమతి, ప్రవీణ్ గౌడ్ జడ్పిహెచ్ఎస్ కందూర్ 74 మార్కులు, మూడవ బహుమతి సంజీవినిజడ్పీహెచ్ఎస్ (బాలికలు)బాలానగర్ 70 మార్కులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ సుధాకర్ రెడ్డి ,సోషల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రతంగాపాణిరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, బాలవర్ధన్ రెడ్డి, పాండురంగ, వెంకటయ్య బురాన్ పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

బిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంఛార్జ్ బాసు హనుమంతునాయుడు



క్రీడా కారులతో కబడ్డీ ఆడుతున్న బాసు హనుమంతు నాయుడు

**గద్వాల ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపు, ఓటమిలను సమానంగా చూడాలని బిఆర్‌యస్ పార్టీ గద్వాల నియోజక వర్గ ఇంచార్జ్ బాసు హనుమంతునాయుడు అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామంలో శ్రీ మారెమ్మ అవ్వ దేవత మహోత్సవాలకు ముఖ్యాతిదులుగా హనుమంతు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కబడ్డీ టోర్నమెంట్‌నుఆయన ప్రారంభించారు. అనంతరం, బాసు హనుమంతు నాయుడు క్రీడాకారులకు కబడ్డీ టోర్నమెంట్ క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణ వల్ల యువకుల మధ్య స్నేహబంధం పెరగడంతో పాటు, ఆటల పట్ల పట్టుదల పెరుగుతోందని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రదర్శనలు చేయాలని, భవిష్యత్తులో క్రీడా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి గద్వాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యతో పాటు క్రీడనైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలనీ, క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదనీ, గెలిచాము అని గర్వ పడవద్దనీ వ్యక్తపరిచారు. స్నేహపూర్వకంగా క్రీడలనుఆడి, ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, మోనేష్, చక్రధర్ రెడ్డి, శేఖర్ నాయుడు, శ్రీరాములు, రజినీబాబు, నరేష్, తిమ్మప్ప, నరసింహులు, అంజి, కృష్ణ, రవి, రాజు, వీరేష్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరం


ఎమ్మెల్యే మాతృమూర్తి జనంపల్లి శశికళ రెడ్డి

**రాజాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇల్లు నిరుపేదలకు వరం లాంటివని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళరెడ్డి అన్నారు. సోమవారం రాజాపూర్ మండలంలోనిమోత్కులకుంట తండా గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు న్యాయం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతాకృష్ణనాయక్, ఉపసర్పంచ్ జగన్ నాయక్, మాజీ సర్పంచ్ రవినాయక్, లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యులు, తండావాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మాతృమూర్తి జనంపల్లి శశికళ రెడ్డి

## శ్రీదత్త మల్టీ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవ వారోత్సవాలు



**బాలానగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** బాలానగర్ రైల్వే స్టేషన్ రోడ్డులో గల శ్రీదత్త ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనిజింగ్ డైరెక్టర్ డా.నెమిలేటి మౌనిక, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ బి. మారుతీ మాట్లాడుతూ వార్షికోత్సవ సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆసుపత్రిలో రాయితీలను ప్రకటించారు. 7వ తేదీ వరకు ఉచిత ఓపి ఇస్తున్నామన్నారు. రక్త పరీక్షలు 30శాతం డిస్కౌంట్ ఉంటుందని, అతి తక్కువ ధరలకే కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తామన్నారు. స్త్రీల ఆరోగ్య సమస్య ల పట్ల మెరుగైన వైద్యం, సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులకు చక్కని వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ సంవత్స రకాలం తమ హాస్పిటల్‌ను ఆదరించిన పరిసర ప్రాంత ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా తమను ఆదరించి సహకరించాలన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందమోని దత్తాత్రేయ, మాజీ సర్పంచ్ సాటి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్వ శ్రీను, ప్రసన్నకుమార్, సచిన్, భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేశం నాగరాజుగౌడ్

## కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు

● పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్

**అమరచింత ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ అన్నారు. సోమవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని టిఆర్ఎస్, బిజెపి పార్టీకి చెందిన 20 మంది కార్యకర్తలకు కాంగ్రెస్ కండువాలు కప్పికాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగ కేశం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 15 కోట్ల నిధులుతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు. అలాగే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్, సిపిఎం బలపర్చిన అభ్యర్థుల విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి అయ్యోఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులులక్ష్మీకాంతరెడ్డి, విష్ణు, తొమ్మిదవ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిటికల్ పోలింగ్ కేంద్రాల తనిఖీ



క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి

**దేవరకద్ర, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా దేవరకద్ర పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బలుసుపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆమె ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, ఈవో సీతా నాయక్, దేవరకద్ర ఎస్సై నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన ఇసుకను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి2 ప్రభాతవార్త :** పెద్దాపురం గ్రామంలో సీజ్ చేసిన ఇసుకను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు తహసీల్దార్ అద్దంకి సునీతకు వినతి పత్రం అందజేశారు. డిసెంబర్ 31 న 2025 దాదాపు 350 ట్రిప్పుల ఇసుకను ఆర్ఐ, జిపిఓ సమక్షంలో పంచనామా చేసి సీజ్ చేశారు. పెద్దాపూర్ గ్రామ చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో డంపు చేసిన ఇసుకను జనవరి 31 న ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలించారని ఆయన చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కల్వకుంట తండా అభివృద్ధి పనులకు ప్రణాళిక



అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సర్పంచ్

**బిజినేపల్లి, ఫిబ్రవరి2 ప్రభాతవార్త:** కల్వకుంట తండా గ్రామపంచాయతీ ప్రజల మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ కేతావత్ సరోజమాన్య నాయక్ అన్నారు. కల్వకుంట తండా పరిధిలోని మూడుతాండాలకు త్రాగునీరు అందించే లక్ష్యంగా సోమవారం మిషన్ భగీరథ ఏఈ మేకల బాలస్వామితో ప్రణాళికలు తయారు చేశారు. ఇటీవలే బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణం కోసం పిఆర్ఏఈ కార్తీక్ రెడ్డి తో సర్వే నిర్వహించారు. గ్రామస్థాయిలో అవసరాలను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో వేగవంతంగా అభివృద్ధి పనులను చేస్తామన్నారు.

## నూతన సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందండి

మాజీ ఎంపీపీ అన్మగల్ల నర్సింలు

**రాజాపూర్, ఫిబ్రవరి2 ప్రభాతవార్త:** నూతనంగా కొలువుదీరిన రాజాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేసి ఆయా గ్రామాల ప్రజల మన్ననలు పొందాలని మాజీ ఎంపీపీ అన్మగల్ల నర్సింలు అన్నారు. సోమవారం రాజాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎంపీపీ నర్సింలు మాట్లాడుతూ మండల అధికారుల, గ్రామ ప్రజల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దుకుని మంచి సర్పంచ్‌లుగా గుర్తింపు పొందాలని అన్నారు. అవకాశం వచ్చినప్పుడే సద్వినియోగం చేసుకోవాలని మంచిపనులు చేసి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని అన్నారు. అంతకుముందు రాజాపూర్ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నూతన సర్పంచులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోఅంబేద్కర్‌సంఘం మండల అధ్యక్షులు పోలేపల్లి కృష్ణ, అంబేద్కర్ సంఘం సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, పలు పార్టీల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



సర్పంచ్‌లను సన్మానించిన దృశ్యం

## గద్వాల మున్సిపల్‌లో

# కాంగ్రెస్ అభ్యర్థుల బి ఫామ్ కేటాయింపుపై తర్జన భర్జన

- ఇప్పటికే గులాబీ గూటికి చేరిన ఆశించి భంగపడిన అభ్యర్థులు
- టిక్కెట్లు ఇస్తే మళ్ళీ తిరిగి తీసుకవస్తానన్న సరిత తిరుపతయ్య?
- తగ్గేదే లేదంటున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి
- టిక్కెట్ల పంచాయితీపై ఎమ్మెల్యే ఇంటికి సంపత్ కుమార్
- నేడు లెక్క తేలనున్నట్లు తెలుపుతున్న కాంగ్రెస్ వర్గాలు








జెడ్పీ మాజీ ఛైర్మన్ సరిత తిరుపతయ్య



ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా గద్వాల మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు విషయంలో అధిష్టాన నాయకులు తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం. గత ఎమ్మెల్యే ఎన్నికల నుండి గద్వాల నియోజక వర్గంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు విమర్శలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే సరిత వర్గం నుండి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును ఆశించిన అభ్యర్థులు గులాబీ గూడుకు చేరారు. సరితకు కాంగ్రెస్ నుండి టిక్కెట్లు ఇస్తే కారెక్కిన తన అనుచర వర్గాన్ని మళ్ళీ వెనక్కు తీసుకువస్తానని చెప్పినట్లు సమాచారం. అయినా తగ్గేదే లేదని ఎమ్మెల్యే మొండి పడుతున్నట్లు రాజకీయ విశ్లేషకుల నుండి సంకేతాలు వినిపిస్తున్నాయి. సోమవారం ఈ టికెట్ల పంచాయతీ పరిష్కరించేందుకు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఇంటికి వచ్చారు. పంచాయతీలో సరిత వర్గానికి 10 టిక్కెట్లు ఇవ్వాలని అడగగా ఎమ్మెల్యే ఒప్పుకోలేదని సమాచారం. గట్టిగా ఒత్తిడి చేయడంతో గెలిచే అభ్యర్థులకు రెండు లేదా మూడు టిక్కెట్లు ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా పూర్తి లెక్క నేడు తేలనుంది. నేడు రెబల్ గా నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థుల ఉప సంహరణ అనంతరం బరిలో వున్న అభ్యర్థులకు టిక్కెట్ల కేటాయించి ఎన్నికల అధికారులకు బి ఫామ్ లను సమర్పిస్తారని తెలుస్తుంది. 37 వార్డులలో ఇప్పటికే కాంగ్రెస్ నుండి నామినేషన్ వేసిన అభ్యర్థుల్లో 47 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సమాచారం. చివరగా బరిలో ఎవరూ వుంటారు ఎవరు ఉప సంహరించుకుంటారు అన్నది నేడు తెలుస్తుంది. ..వర్గ పోరు...గత ఎన్నికల్లో బిఆర్ యస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఇప్పటికీ బిఆర్‌యస్ పార్టీ లోనే ఉన్నానని అసెంబ్లీ సాక్షి గా చెబుతూ ఎన్నికలు వచ్చేసరికి అభివృద్ధి కోసం అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించండనీ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అదేవిదంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో జెడ్పీ మాజీ చైర్మన్ సరిత కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందగా తనను నమ్ముకుని వున్న గద్వాల నియోజక వర్గ నాయకులను, కార్యకర్తలను వీడకుండా పార్టీ అధిష్టాన ఆదేశాల మేరకు పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటు పడుతున్నారు. ఇదిలా వుండగా గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఇరు వర్గాల బలంగా పనిచేసి కొంత అటూ ఇటుగా వారి అభ్యర్థులను పెద్ద మొత్తంలో గెలిపించుకున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఇరువర్గాలు కలిసి పనిచేస్తే గద్వాల కోటపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని అధిష్టానం ఆలోచిస్తుంది. ఇరువర్గాలను సద్దు మనచక పోతే కారు జోరు పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.



ఎంపీ డీకే అరుణతో కలిసి ఎంవిఎస్ కళాశాలలో సభ ఏర్పాట్ల పరిశీలిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు

## రేపు పాలమూరుకు బిజెపి జాతీయ అధ్యక్షుడు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నిడనుందని తెలిపారు.

కార్పొరేషన్ పై బిజెపి జెండా.. తొలిసారి మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఏర్పాటు అయినతర్వాత జరగనున్న ఎన్నికల దృష్ట్యా మహబూబ్‌నగర్ కార్పొరేషన్ లోని 60 డివిజన్లకు గాను 30 డివిజన్లకు పైగా బిజెపి అభ్యర్థులు కార్పొరేటర్‌గా గెలిచి మేయర్ పీఠాన్ని దక్కించుకుందాం అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. ఎంవీఎస్ కళాశాలలో సభ ఏర్పాట్లను ఆమె పరిశీలించి అనంతరం మాట్లాడారు. నితిన్ నబిన్ తొలిసారి పాలమూరుకు రానున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకాలని, మున్సిపల్ కార్పొరేషన్ పై జెండా ఎగురవేసి బహుమతిగా ఇద్దామని ఎంపీఅరుణ పిలుపునిచ్చారు. వారి వెంట మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి ఆశిష్ షెలార్, బీజేపీ సీనియర్ నాయకులు నాగు రావు నామాజీ, ప్రేమేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస రెడ్డి, జిల్లా నాయకురాలు బాలా త్రిపుర సుందరి తదితరులు ఉన్నారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహణ
- రక్తదానం చేద్దా .. ప్రాణదాతలవుదాం
- బిఆర్‌ఎస్ జడ్చర్ల నియోజకవర్గ నేతల పిలుపు



రక్తదానం చేస్తున్న దృశ్యం (ఫైల్)



మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డా. సి. లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మాజీ మంత్రి, బిఆర్‌ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా జడ్చర్లలో మెగారక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జడ్చర్ల నియోజకవర్గం బిఆర్‌ఎస్ నాయకులు ప్రకటించారు. మంగళవారము ఉదయం 9 గంటల నుండి ప్రేమ్ రంగా గార్డెన్‌లోరక్తదాన శిబిరంప్రారంభం అవుతుందని తెలిపారు. అంతకుముందు జడ్చర్లప్లై ఓవర్‌నుండి పెద్ద ఎత్తున భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్పర్సన్, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్య కర్తలు అభిమానులు భారీ ఎత్తున పాల్గొని రక్తదాన శిబిరాన్నివిజయవంతం చేయాలని కోరారు. గత22 సంవత్సరాలుగా రక్తదాన శిబిరం కొనసాగు తుందని, వేలాదిమంది యువకులు నాయకులు పార్టీ కార్యకర్తలు లక్ష్మారెడ్డి అభిమానులు రక్తదానం చేసి వేలాదిమందికి ప్రాణదాతలుగా నిలిచారని ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మరో అడుగుముందుకేసి ఈఏడాది పెద్దఎత్తున రక్తదాన శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు బిఆర్‌ఎస్ నేతలు పిలుపునిచ్చారు.

## అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడటంతో వ్యక్తి మృతి

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఏదుట్ల శ్రీను(45) తన వ్యవసాయ పొలంలో తన ట్రాక్టర్ తో వరి మడి చేసే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ట్రాక్టర్ కిందపడి శ్రీను అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మృతునికి ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం కోసంవనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ సంఘటనతో శ్రీరంగాపురం మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రమాదకరంగా ఐమాస్ట్ లైట్




ప్రమాదకరంగా ఉన్న ఐమాస్ట్ లైట్

**దామరగిద్ద, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఐమాస్ట్‌లైట్ ప్రమాదకరంగా మారింది. ఇది చాలాపాతది కావడంతో పూర్తిగా తుప్పుపట్టి, ఎప్పుడైనా కూలిపోవచ్చనే ఆందోళన నెలకొంది. ఈ చౌరస్తా ప్రాంతంలో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి పరిస్థితిలో ఐమాస్ట్ లైట్ కూలితే భారీ ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదకరంగా ఉన్న ఐమాస్ట్ లైట్‌ను తొలగించి, కొత్త ఐమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కంపెనీ నుండి వెలువడే దుమ్ము, ధూళి నుంచి కాపాడండి



చెట్లపై పేరుకుపోయిన దుమ్ము




**బాలానగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** బాలానగర్ మండలం మాచారం గ్రామ రెవెన్యూ శివారులోని శ్రీ వినాయక మైక్రాన్ (ఇండియా) ప్రైవేట్ లిమి టెడ్ కంపెనీ నుండి వెలువడే దుమ్ము, ధూళి నుండి తమను, తమ పంటలను కాపాడాలని కంపెనీ పరిసర ప్రాంత రైతులు వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కంపెనీ నుండి వెలువడే దుమ్ము, దూళితో పంటల దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోయారు. కంపెనీ పరిసరప్రాంతాలలో చెట్లపై దుమ్ముపేరుకుపోయి, గాలి వీచినప్పుడు పశు గ్రాసంపై దుమ్ము, ధూళి పడడంతోఆవులు, గేదెలు గడ్డి తినలేక అనారోగ్యానికి గురవుతున్నాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి, దుమ్ము, ధూళి నుంచి తమని కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు.

## తహసీల్దార్ వినతి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి2 ప్రభాతవార్త :** పెద్దాపురం గ్రామంలో సీజ్ చేసిన ఇసుకను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు తహసీల్దార్ అద్దంకి సునీతకు వినతి పత్రం అందజేశారు. డిసెంబర్ 31 న 2025 దాదాపు 350 ట్రిప్పుల ఇసుకను ఆర్ఐ, జిపిఓ సమక్షంలో పంచనామ చేసి సీజ్ చేశారు. పెద్దాపూర్ గ్రామ చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో డంపు చేసిన ఇసుకను జనవరి 31 న ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలించారని ఆయన చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అభ్యర్థులకు నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు

**గద్వాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకుగుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్స్ ముద్రణపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నామినేషన్ల విత్ డ్రా అనంతరం వివిధ రాజకీయ పార్టీల తరపున, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారికి ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి ఆయా గుర్తులను కేటాయించాల్సి ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలతో కూడిన బ్యాలెట్ పేపర్ ల ముద్రణ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫైనల్ ప్రూఫ్ రీడింగ్ అనంతరం రిటర్నింగ్ అధికారులు బ్యాలెట్ పేపర్స్ ముద్రణ చేయించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వారందరికీ పోస్టల్ బ్యాలెట్స్ అవకాశం కల్పించడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులందరూ హ్యాండ్ బుక్కును క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందులోని నిబంధనల ప్రకారం ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, ఎన్నికల నోడల్ అధికారులు శ్రీనివాసరావు, రమేష్ బాబు, శ్రీనివాస్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయించాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అనంతరం రిటర్నింగ్ అధికారులు బ్యాలెట్ పేపర్స్ ముద్రణ చేయించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వారందరికీ పోస్టల్ బ్యాలెట్స్ అవకాశం కల్పించడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులందరూ హ్యాండ్ బుక్కును క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందులోని నిబంధనల ప్రకారం ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ట్రైనీ నోడల్ అధికారి డిఈఓ ప్రవీణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి, సిఎంఓ సుధాకర్ రెడ్డి శిక్షకులు పాల్గొన్నారు.

### రాముడు పేరు చెప్పి పేదలకు అన్యాయం చేస్తే

# గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడుదాం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ప్రభుత్వంచేపట్టిన వ్యతిరేక విధానాల పట్ల ఆమె కూలీలతో మాట్లాడారు. అనంతరం బుద్దతండా, చెంచు గూడెంలో జరిగిన గ్రామసభలో గతంలో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మహాత్మ గాంధీపేరు మార్చి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవికా మిషన్ గ్రామిన్ ( విబిజి ఆర్ ఎఎంజి) పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావడంజరిగిందని ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షినటరాజన్, తమిళనాడు ఏఐసీసీ, టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడువంశీకృష్ణ, ఆదివాసుల రాష్ట్రఅధ్యక్షుడు, నల్గొండ ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, అచ్చంపేట డివిజన్ పోలీస్ అధికారి పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్సైలు సద్దాం, రాజేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, నరసయ్య యాదవ్, మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, హరి నారాయణ గౌడ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, ఓబిసి జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడుపాల గోపాల్ రెడ్డి, అచ్చంపేట నియోజకవర్గ తెలంగాణ జేఏసీ చైర్మన్ కాశన్న యాదవ్, రాజీవ్ పంచాయతీ రాజ్ సంఘటన్ కన్వీనర్ శత్రు నాయక్, నాయకులుకపిలవాయి చంద్రమోహన్, శ్రీపతిరావు, కృష్ణారెడ్డి, నరసింహారావు, రాంప్రసాద్‌గౌడు, శ్రీనివాసులు, మహేందర్, ఆయా గ్రామాల సర్పంచులు, అచ్చంపేట మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి

## లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక పూజలు

**అనిరుధ్ యువసేన వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే శ్రీకారం**

**లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ**



**రాజాపూర్, ఫిబ్రవరి2 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రంగారెడ్డి గూడ గ్రామంలో జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు అనిరుధ్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం పేదల గృహ కలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా శివ స్వాముల మెట్ల పూజ



**ఖిల్లాగణపురం ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్వతాపురం గ్రామంలోని శివాలయంఆవరణలో సోమవారం శివ స్వాములు ఘనంగా శివుడికి మెట్ల పూజ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి శివ స్వాములు తరలివచ్చారు. గ్రామంలో ఉన్న మహిళలు యువకులు పెద్దలు అందరూ ఈ యొక్క శివుడి మెట్ల పూజలో పాల్గొనిభక్తిలో మునిగిపోయారు. అనంతరం మధ్యాహ్నం శివస్వాములతో పాటు పాల్గొన్న వారందరికీ తీర్థ ప్రసాదాలతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఎండాకాలంలో నీటి సమస్యల నివారణపై గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపిడిఓ రామన్న

**మద్దూరు, ఫిబ్రవరి2 ప్రభాతవార్త:** మద్దూరు మండల పరిధిలో ఎండా కాలం సీజన్‌లో గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిఎంపీడీవో రామన్న అన్నారు. అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి, చెన్వార్ గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి కొరత ఏర్పడే గ్రామాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట అదనపు బోర్లు, బోర్లకు ఎక్స్‌టెన్షన్ పైపులైన్లు, నల్లాలకుఆన్-ఆఫ్ ఫిట్టింగ్‌లుఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కారానికి కృషి చేస్తామనిహామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో అచ్చంపల్లి సర్పంచ్ ఇందిరమ్మ, అప్పిరెడ్డిపల్లి సర్పంచ్ మల్లేశ్వరి, చెన్వార్ సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నయ్య, డిప్యూటీ ఏఈ శిరీష, పంచాయతీ కార్యదర్శులుమైపాల్, అనిత, బసవరాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# భక్తులతో కిక్కిరిసిన మన్నెంకొండ



స్వామివారి రథోత్సవం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

రాష్ట్రాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం నడుమ లక్ష్మి వెంకటేశ్వర స్వామి రథం పై మునల కొండ మాడవీధులలో పద్మావతి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. ముందుగా స్వామివారు కొండపై నుంచి మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుల్లు, భక్తుల భజన కీర్తనలు, కోలాటాలు, బాణాసంచా నడుమ పల్లకి సేవలో గరుడవాహనంలో ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామివారికి హారతి ఇచ్చి రథోత్సవం ప్రారంభించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కోనేటిలో స్నానా లు ఆచరించి స్వామివారి రథాన్ని (తేరు) లాగి గోవిందా గోవిందా అంటూ నామస్మరణ చేశారు. వేలాదిగా కిక్కిరిసిపోయిన భక్తజనం ఒక్కసారిగా గోవింద నామస్మరణ చేయడంతో మునల కొండలు పులకరించాయి. రథోత్సవం అనంతరం భక్తులు స్వామి వారికి మట్టి కుండలో అన్నం వండి.పచ్చి పులుసుతో దాసంగం పెట్టి తలనీలాలు సమర్పించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఎడ్లబండిపై వచ్చి స్వామివారిని దర్శించుకోగా, సుదూర ప్రాంతాల ప్రజలు బస్సు, ఇతర ప్రైవేట్‌వాహనాలలో వచ్చారు. కాగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పించారు. అంతేకాక జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాలతో బ్రహ్మోత్సవాల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా 410 మంది





పూజల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ